
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శనివారం 3 ఫిబ్రవరి 2024




ఈ ఏడాది పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్

- ఆర్థిక ప్రయోజనాలు లేకుండానే ఇంటిబాట
- బడ్జెట్ లేక కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎప్పుడిస్తుందో తెలియని దుస్థితి
- దాచుకున్న డబ్బూ ఇవ్వకపోవడంపై ఆ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏళ్లపాటు సేవలు అందించారు. ఎన్నో ఒత్తిళ్లను భరించారు. వయసు మీద పడుతోంది. రిటైర్మెంట్ సమయం రానే వచ్చింది. చేస్తున్న ఉద్యోగాన్ని వీడి ఇంటికెళ్లాల్సి వస్తోంది. శేషజీవితం హాయిగా గడపాలని ప్రతి ఉద్యోగీ కోరుకుంటాడు. ఉద్యోగంలో పడిన బాధలన్నీ మరచిపోయి కుటుంబంతో సంతోషంగా గడపాలనుకుంటాడు. ఉద్యోగ కాలంలో తాను దాచుకున్న డబ్బు, ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రయోజనాలతో గతంలో ఆనందంగా ఇంటికెళ్లేవారు. వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేదు. ఒక్కటంటే ఒక్క ఆర్థిక ప్రయోజనం కూడా ప్రభుత్వం అందించట్లేదు. ఎప్పుడిస్తుందో కూడా చెప్పట్లేదు. అసలు ఇస్తుందో.. లేదో కూడా వెల్లడించట్లేదు. దీంతో రిటైర్ అయిన ఉద్యోగులు వట్టి చేతులతో ఇంటికెళ్లాల్సి వస్తోంది. ఇక, శేషజీవితంలో ఆనందం, హాయి ఎక్కడి నుంచి వస్తాయి? ఏళ్లపాటు చేసిన సేవలకు ప్రభుత్వం ఇచ్చే ప్రతిఫలం ఇదేనా అంటూ వారు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. తాము దాచుకున్న డబ్బు కూడా ఇవ్వకపోవడం ఏమిటని మండిపడుతున్నారు.

ధర్మవరం



# వట్టి చేతులతో ఇంటికే...!

రాష్ట్రంలో వైసీపీ సర్కారు ఉద్యోగ విరమణ వయసును 62ఏళ్లకు పెంచింది. దీంతో ఈ ఏడాది రిటైరవుతున్న ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందుతాయా?లేదా అన్న సందేహం ప్రస్తుతం ఆ వర్గాల్లో నెలకొంది. 62 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈనెల నుంచే ఉద్యోగ విరమణ పొందనున్నారు. జిల్లాలో దాదాపు 21వేల మంది ఉద్యోగులున్నారు. వీరిలో ఈ ఏడాది దాదాపు 900 మంది రిటైర్ కానున్నట్లు తెలుస్తోంది. ప్రతినెలా ఉద్యోగ విరమణ పొందే వారికి ఉద్యోగ స్థితి, క్యాడర్‌ను బట్టీ ఒక్కొక్కరి గెజిటెడ్ అధికారి, నాన్ గెజిటెడ్ ఉద్యోగులైతే రూ.40 లక్షల నుంచి గరిష్ఠంగా కోటి రూపాయల వరకు, క్లాస్ ఫోర్ ఉద్యోగం మొదలుకొని అధికారి, సబార్డినేట్ వరకు ఒక్కొక్కరికి రూ.20లక్షలుపైగా ఆర్థిక ప్రయోజనాల కింద ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఇంక్రిమెంట్లు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, గ్రాట్యుటీ, సరెండర్ లీవ్‌లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితర ఆర్థిక ప్రయోజాలను ఉద్యోగ విరమణ బెనిఫిట్‌గా పరిగణిస్తారు. గత ప్రభుత్వంలో ఈ ఆర్థిక ప్రయోజనాలను లెక్కగట్టి, ఉద్యోగ విరమణ రోజునే కవర్లో పెట్టి సంబంధిత ట్రెజరీ ఆర్డర్‌ను ఉన్నతాధికారులు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రతినెలా జీతం ఇస్తే అదే పదివేలు అనుకునే పరిస్థితి రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దాపురించింది. 1వ తేదీ జీతాలు చెల్లించాలంటూ ఉద్యోగులు ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు చేసినా, సమ్మె నోటీసులు అందజేసినా ప్రభుత్వంలో చలనం లేదు. కొన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామని ప్రకటిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



### వీఆర్ఎస్ బాట

వైసీపీ ప్రభుత్వ విధానాలతో విసిగి వేసారిపోతున్న పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు 62 ఏళ్ల వరకు విధులు నిర్వర్తించకుండానే స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారు. వీరిని మినహాస్తే ఈ ఏడాది ఉద్యోగ విరమణ పొందుతున్నవారు ఆర్థిక ప్రయోజనాలపై ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వివిధ బకాయిల రూపంలో ప్రభుత్వ ఉద్యోగులకు దాదాపు రూ.20వేల కోట్లు చెల్లించాల్సి ఉందని ఉద్యోగ నేతలు పేర్కొంటున్నారు. వీటిని వెంటనే చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశాయి. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనాలు ఎప్పటికి అందుతాయోనన్న ఆందోళన నెలకొంది. ప్రస్తుతానికి సగం చెల్లించి, మిగిలిన మొత్తానికి బాండ్ల రూపంలో ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందుతున్న వారికి ఈనెల నుంచి పెన్షన్ మార్చిలో అందనుంది. మూడు డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ అరియర్స్‌తోపాటు గతేడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన 12వ పీఆర్సీ ప్రయోజనాలు పొందకుండానే రిటైరవుతుండడం బాధాకరమని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

### ఎప్పుడు చెల్లిస్తుందో?

ప్రస్తుతం ఈ ఏడాదిలో ఉద్యోగ విరమణ పొందుతున్న వారితోపాటు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు జీతభత్యాలు ఈ నెలలో ఏ తేదీన చెల్లిస్తుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులకు మధ్యంతర భృతి(ఐఆర్) 30శాతం ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. 12వ పీఆర్సీ పే కమిషన్‌ను నియమించి ఐదునెలల గడుస్తున్నా ఇంతవరకు క్షేత్రస్థాయిలో ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకున్న పాపాన పోలేదని ఆ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. అభిప్రాయాలు తీసుకుని, ప్రభుత్వానికి సిఫారసు చేసి, పీఆర్సీ అమలు చేసేది ఎప్పుడని ఆ వర్గాలు నిట్టూరుస్తున్నాయి.

### తెలుగు యువత నాయకుల ధ్వజం

### చెవిలో పూలు పెట్టుకుని నిరసన

నిరసన తెలుపుతున్న తెలుగు యువత నాయకులు



## మెగా డీఎస్సీ పేరుతో మోసం

హిందూపురం, ఫిబ్రవరి 2: మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని తెలుగు యువత నాయకులు ధ్వజమెత్తారు. తెలుగు యువత ఆధ్వర్యంలో చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో నిరుద్యోగులు శుక్రవారం చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నపుడు జగన్ రాష్ట్రంలో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, అధికారంలోకి రాగానే వాటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఐదేళ్లు పూర్తవుతుండగా ఇప్పుడు మెగా డీఎస్సీ అంటూ మినీ డీఎస్సీ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 10లక్షలదాకా ఉన్నారనీ, 6 వేల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇస్తే ఇక 9.94 లక్షల మంది ఏం కావాలని మండిపడ్డారు. జగన్ సీఎంగా దిగిపోయే కాలం దగ్గరపడిందని శాపనార్థాలు పెట్టారు. నిరుద్యోగులు నమ్మే ప్రసక్తేలేదన్నారు. ప్రస్తుతం వదిలిన డీఎస్సీ నోటిఫికేషన్ ఫేక్ అని విమర్శించారు. కార్యక్రమంలో తెలుగు యువత నేతలు సురేంద్రయాదవ్, నరేష్‌యాదవ్, చౌదరి, బీసీసెల్ నియోజకవర్గ నాయకుడు చంద్రమోహన్, సోమగట్ట మంజునాథ్ పాల్గొన్నారు.



### మంత్రి పర్యటనకు ఎమ్మెల్యే తిప్పేస్వామి దూరం



మడకశిరటౌన్, ఫిబ్రవరి 2: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనకు మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి దూరంగా ఉన్నారు. మంత్రి శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించారు. పలుచోట్ల సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరుకాకపోవడం చర్చకు దారితీసింది. గుడిబండ మండలంలో మంత్రి మాట్లాడుతూ.. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన ఈరలక్కప్ప అభ్యర్థిగా ఉంటారనీ, అందులో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే వర్గం ఎలాంటి నిర్ణయం తీసుకొంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యే తిప్పేస్వామి తనకే అవకాశాలు ఉంటాయని సన్నిహిత వర్గాలతో చెప్పినట్లు సమాచారం. మంత్రి సమావేశాలకు జనంలేక మహిళా సంఘాల సభ్యులను తరలించినట్లు తెలుస్తోంది.


### టీడీపీ నాయకుల హౌస్ అరెస్టు

అగళి: మంత్రి పెద్దిరెడ్డి పర్యటన నేపథ్యంలో మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. మంత్రిని ఎక్కడ అడ్డుకుంటారోనని డొక్కలపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ కుమార్‌స్వామి, జడ్పీటీసీ ఉమేష్‌ను హౌస్ అరెస్టు చేశారు. మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు.




మండల కన్వీనర్ కుమార్ స్వామికి నోటీసు అందజేస్తున్న ఏఎస్ఐ బషీర్

### 20లోగా పరీక్ష ఫీజు చెల్లించండి



కొత్తచెరువు, ఫిబ్రవరి 2: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ పరీక్షలకు ఈనెల 20వ తేదీలోగా ఫీజు చెల్లించాలని జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. టెక్నికల్ కోర్సు లోయర్, హయ్యర్‌లో డ్రాయింగ్, హ్యాండ్ వీవింగ్ హయ్యర్ కింద టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ కోర్సులకు ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

### నేటి ఇంటర్మీడియట్ పరీక్ష వాయిదా



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 2: ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించాల్సిన మొదటి సంవత్సరం పర్యావరణ విద్య పరీక్ష వాయిదా పడింది. పరీక్షను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి రఘునాథరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### నేడు మడకశిరకు ప్రవీణ్ ప్రకాష్



మడకశిర రూరల్, ఫిబ్రవరి 2: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మడకశిర నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. దీంతో ఉపాధ్యాయుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లోని పలు పాఠశాలలను తనిఖీ చేయనున్నరు. ఏ పాఠశాలకు వెళ్లి తనిఖీ చేస్తారోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9.30కి ఆయన మడకశిరకు చేరుకుని, మండలంలోని పలు పాఠశాలలు తనిఖీ చేసి, అనంతరం రొళ్ల, అగళి మండలాలకు వెళ్లనున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు.



ఆలయ మైక్ సెట్‌లో జగన్ పాటలు పెట్టడంతో ఏమీ అనలేక మూలన కూర్చున్న పూజారి

## రామాలయ మైక్‌లో జగనన్న భజన

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 2: మంత్రి ఉష శ్రీచరణ్‌కు స్వాగతం పలికేందుకు అధికార పార్టీ నాయకులు ఏకంగా రామాలయ మైక్‌సెట్‌లో జగనన్న పాటలు పెట్టారు. ఊరందరికీ వినిపించేలా భారీగా సౌండ్ పెంచారు. ఇటీవల పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితురాలైన ఉష శ్రీచరణ్.. సోమందేపల్లి మండలంలో శుక్రవారం పర్యటించారు. తుంగోడు పంచాయతీ చిన్నబాబయ్యపల్లికి చేరుకున్న ఆమెకు వైసీపీ స్థానిక నాయకులు స్వాగతం పలికేందుకు రామాలయంలో ఏర్పాటు చేసిన మైక్‌ను వాడుకున్నారు. మైక్‌సెట్‌కు సెల్‌ఫోన్ ద్వారా వైఎస్ జగన్‌ను పొగుడుతూ పాడిన పాటలను కనెక్ట్ చేసి.. ఊరంతా వినబడేలా సౌండ్ పెంచారు. ఉదయ, సాయం సంధ్యల్లో రామ సంకీర్తనలు, భక్తి పాటలను వినే ఊరి జనం.. ఆలయ మైక్ నుంచి జగనన్న భజన పాటలు రావడం చూసి అవాక్కయ్యారు. ఇదేం పద్ధతి అని వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి సొంత పంచాయతీ కావడంతో తనను ఎవరూ ప్రశ్నించరన్న ధీమాతో బరితెగించారని విమర్శించారు. వస్తున్నది మంత్రి, మైక్‌ను వాడుకుంటున్నది అధికార పార్టీవారు కావడంతో ఆలయ పూజారి నిస్సహాయంగా ఓ మూలకు కూర్చుండిపోయారు.

## జనం రారనా..?

### వార్డు వార్డుకి అంటూ తొలుత ఆర్భాటం

ఎనిమిదేసి వార్డులకు కలిపి అంటూ ప్రకటన

మంత్రి పెద్దిరెడ్డి కార్యక్రమాల కుదింపు



హిందూపురం, ఫిబ్రవరి 2: వైసీపీలో ముదిరిన విభేదాలను చక్కదిద్దేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురంలో వార్డు వార్డు సమావేశం పెడతారని ముఖ్యనేతలు కొన్నిరోజుల క్రితం ఆర్భాటంగా ప్రకటించారు. గత నెలలో హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఒక్కో పంచాయతీలో సమావేశం పెట్టారు. అదేరీతిలో హిందూపురం పట్టణంలో వార్డు వార్డుకు సమావేశం ఉంటుందని ముఖ్య నేతలు తీర్మానించారు. జనం రారని తెలిసి సీన్ రివర్స్ అయింది. ఎనిమిదేసి వార్డులకు ఒకేచోట సమావేశం పెట్టేందుకు తాజాగా నిర్ణయించారు.

### ఎనిమిదేసి వార్డుల్లో ఒకేచోట..

సంక్షేమ పథకాలను విరివిగా అందించామనీ, కావున ప్రతి ఇంటి నుంచి సమావేశానికి వస్తారని అధికార పార్టీ నేతలు భావించారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ పలుచబడుతోంది. అధికార పార్టీ నాయకుల్లో సైతం విభేదాలు ముదిరి పాకానపడ్డాయి. ఈ పరిస్థితుల్లో వార్డు వార్డుకు సమావేశం పెడితే జనంరారన్న భయం వైసీపీ నేతలకు పట్టుకుంది. చేసేదిలేక ఎనిమిదేసి వార్డులకు ఒకేచోట సమావేశం పెట్టడానికి తీర్మానించారు. దీనిని బట్టి అధికార పార్టీని భయం వెంటాడుతుందన్న విషయం స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### అందుకే కుదించారా?

గత నెలలో పంచాతీల్లో నిర్వహించిన సమావేశాలకు జనం రాకపోవడంతో ఆసరా ఆశ చూపి, కొత్త పింఛన్లు ఇస్తామని చెప్పి వెలుగు సిబ్బందిని బెదిరించి, భయపెట్టి జనాన్ని రప్పించినా అంతంత మాత్రమే హాజరయ్యారు. పల్లెల్లోనే అలా ఉంటే ఇక పట్టణంలో ఎలా ఉంటుందోనన్న అధికార పార్టీలో నెలకొంది. పట్టణమంతా ఏడుచోట్లే సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. జనం వస్తారని ఊహించిన మూడు వార్డుల్లోనే సమావేశాలను పెట్టాలని నిర్ణయించారు. రానిచోట ఎనిమిది వార్డులకు కలిపి సమావేశం పెడుతున్నారు. దీనిని బట్టి జనం రారని ముందుగానే అధికార పార్టీ నాయకులు పసిగట్టినట్లున్నారు. దీంతో వార్డులు కలిపి పెట్టాలని నిర్ణయించినట్లు అధికార పార్టీలో చర్చ సాగుతోంది.

### నేడు పురంలో మంత్రి పర్యటన



శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వార్డుల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నారు. హిందూపురం వైసీపీ బాధ్యతలు భుజాన వేసుకున్నందున మంత్రి పెద్దిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధిలా వార్డులవారీగా, పంచాయతీలవారీగా సమావేశాలు నిర్వహిస్తుండడం కొసమెరుపు.



పాఠశాల గేటుకు తాళం వేయడంతో గేటు వద్ద వేచివున్న విద్యార్థులు

## పాఠశాల గేటుకు సర్పంచ్ భర్త తాళం

### మధ్యాహ్న భోజన ఏజెన్సీ నియామకంపై వివాదం

కొత్తచెరువు, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని వంగంపల్లిలో వైసీపీ మద్దతు సర్పంచ్ తమ్మిశెట్టి గంగరత్న భర్త శ్రీనివాసులు అధికార దర్పం ప్రదర్శించాడు. తన వారిని కాదని ఇతరులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఎలా అప్పగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. శుక్రవారం ఏకంగా పాఠశాల గేటుకు తాళం వేసి, అక్కడే తిష్టవేశాడు. దీంతో బడికి వచ్చిన విద్యార్థులు వెనుదిరిగారు. వంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో 20 మందికిపైగా విద్యార్థులున్నారు. ఉపాధ్యాయుడు గోపి ఒక్కరే ఇక్కడ పని చేస్తున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ గిట్టుబాటు కావడం లేదని ఇటీవల నిర్వాహకులు వదిలేశారు. దీంతో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండేవారు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం ఉపాధ్యాయుడు గోపి వేరొకరికి ఏజెన్సీ బాధ్యతలు అప్పటించారు. దీంతో సర్పంచ్ భర్త శ్రీనివాసులు ఆగ్రహించాడు. తనకు ఒక్కమాట కూడా చెప్పకుండా, తన వర్గంవారిని కాదని మరొకరికి ఏకపక్షంగా ఏజెన్సీ ఎలా అప్పగిస్తారని ఉపాధ్యాయుడిపై చిందులు వేశాడు. పాఠశాలకు రావద్దని బెదిరిస్తూ శుక్రవారం ఉదయం పాఠశాల గేటుకు తాళం వేశాడు. విద్యార్థులకు బడి లేదని చెప్పి వెనక్కు పంపించేశాడు. ఎవరు వస్తారో చూస్తానంటూ అక్కడే తన ద్విచక్రవాహనంపై తిష్ట వేశాడు. ఇదే పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు కూడా వచ్చి.. వెనుదిరిగారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు గోపి.. విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ భర్త శ్రీనివాసులుపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలకు చేరుకుని, పాఠశాల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలతో చర్చించారు. సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలకు తాళం వేయడం సరికాదని మందలించారు. పాఠశాల గేటుకు వేసిన తాళాన్ని సాయంత్రం తెరిపించారు.



పాఠశాల గేటుకు తాళం వేసి, అక్కడే ఉన్న వైసీపీ మద్దతు సర్పంచ్ భర్త శ్రీనివాసులు

## ఎన్నికల సంఘం సూచనలు తప్పక పాటించాలి

### కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 2: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా పాటించాలని యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో చేర్పులపై చొరవ చూపాలన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

## ఫైరింగ్ రేంజ్ ప్రారంభం

బుక్కపట్నం, ఫిబ్రవరి 2: మండలంలోని చంద్రాయునిపల్లి సమీపాన తాత్కాలిక ఫైరింగ్ రేంజ్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఫైరింగ్ శిక్షణను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఫైరింగ్ శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరుగుతందన్నారు. పోలీసులు వృత్తిలో నైపుణ్యాన్ని పెపొందించుకోవాలన్నారు. తాత్కాలిక ఫైరింగ్ రేంజ్ మైదానంలో ఏఆర్, సివిల్ పోలీసులకు ఫైరింగ్ శిక్షణతో పాటు ఆయుధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఏఎస్పీ విష్ణు, ఆర్డీఓ భాగ్యరేఖ, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, కంజాక్షన్, హుస్సేన్ పీరా, ఎస్బీ సీఐ రవీంద్రారెడ్డి, సీఐలు రాగిరి రామయ్య, రాజారమేష్, కొండారెడ్డి, హేమంత్‌కుమార్, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, టైటాస్, నారాయణ, ఎస్ఐలు నరసింహులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఫైరింగ్ రేంజ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


కంబదూరులో వివాదం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వివాదాలు, గొడవలకు దారితీస్తోంది. జిల్లా యంత్రాంగం పట్టించుకోక పోవడంతో క్రీడాపోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది నవంబరు లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అసలు సిసలైన క్రీడాకారులను వదిలేసి గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి క్రీడాప్రావీణ్యం లేని వారితో ఆటలు ఆడించడంతోనే గొడవలు ఏర్పడుతున్నాయని పలువురు చెబుతున్నారు. క్రీడా పోటీలకు అవసరమైన కనీస వసతులు తాగునీరు, నీడ, భోజనం ఏర్పాటు చేసేందుకు నిధులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో యువత ఓట్లు కొల్లగొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీల పేరుతో ప్రచారార్భాటాలు చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

అనంతపురం క్లాక్‌టవర్

# గలాటా ఆంధ్ర

## గొడవలకు దారితీస్తున్న 'ఆడుదాం ఆంధ్ర'

- నిధులు లేక ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- అస్తవ్యస్తంగా మారిన పోటీల నిర్వహణ

### పోటీల్లో పలుచోట్ల గొడవలు

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో పలు చోట్ల గొడవలు జరుగుతున్నాయి. కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం, తాడిపత్రి ఇలా ఆయా ప్రాంతాల్లో క్రీడాకారుల మధ్య కొట్టుకునేవరకు వెళ్లిన సంఘటలు ఉన్నాయి. అనంతపురం పీటీసీలో, కంబదూరు, గుంతకల్లు ప్రాంతాలలో క్రీడాకారులు భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు నిర్వహణ లోపానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. క్రీడలతో సంబంధం లేని వారిని క్రీడా పోటీలలో ఆడించడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

### అధికారుల మధ్య సమన్వయలోపం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ బాధ్యత ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. జిల్లా యంత్రాంగం క్రీడలు ప్రారంభించిన తొలిరోజు మాత్రమే చుట్టపుచూపుగా వచ్చి వెళ్లారు. ఇక ఆ తరువాత దాన్ని పట్టించుకోలేదు. గ్రామ-వార్డు సచివాలయాలకు నిర్వహణ బాధ్యత అప్పగించడంతో సామర్థ్యం, సిబ్బంది, అవగాహనలోపంతో గందరగోళంగా మారింది. సాధారణంగా క్రీడా పోటీలు ఆయా క్రీడా సంఘాలు, శాప్, డీఎస్ఏ ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా గ్రామ-వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించడంతోనే అధికారుల మధ్య సమన్వయ లోపం ఏర్పడుతోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఆర్ట్స్ కళాశాలలో ఖాళీగా దర్శనమిస్తున్న టెంట్లు





అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియం

### చిన్న చిన్న గొడవలు సాధారణమే



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో అక్కడక్కడ చిన్నచిన్న గొడవలు జరిగిన మాట వాస్తవమే. అయితే పోటీల ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది. గ్రామ-వార్డు సచివాలయం స్థాయి, మండల స్థాయి పోటీలు ముగిశాయి. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు మలివిడతలో సాగుతున్నాయి. అనేక మంది క్రీడాకారులకు పోటీల్లో భాగస్వామ్యం చేయడమే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రధాన లక్ష్యం. వేలాది మంది క్రీడాకారులు పోటీల్లో ఆడుతుండటం శుభపరిణామం. భవిష్యత్తులో ఈ పోటీలు కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఇదొక మంచి అవకాశంగా క్రీడాకారులు భావిస్తున్నారు.

- నరసింహారెడ్డి, డీఎస్‌డీఓ

# అంతా కొట్లాటే!

- అస్తవ్యస్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు
- పోలీసు బందోబస్తు నడుమ మ్యాచ్‌లు


పీటీసీలో క్రీడాకారుల వాగ్వాదం

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2:** ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలు గందరగోళంగా మారాయి. నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో శుక్రవారం పురుషుల విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించా రు. ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్, అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పీటీసీలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో చియ్యేడు, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడ్డాయి. ఎస్ఎస్‌బీఎన్ జట్టు తరపున కర్నూలుకు చెందిన క్రీడాకారులు ఉండడంతో చియ్యేడు జట్టు సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో వాగ్వాదం జరిగింది. డీఎస్‌డీఓ నరసింహారెడ్డి అక్కడికి చేరుకుని క్రీడాకారుల మధ్య వాగ్వాదాన్ని వారించి మ్యాచ్‌లు సక్రమంగా జరిగేలా చూశారు. పోలీసు బందోబస్తు నడుమ పోటీలు సాగడం గమనార్హం. ఉన్నతాధికారులు, క్రీడా శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో జనవరి 31, ఫిబ్రవరి 1న నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఒక రోజు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో క్రీడాకారులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.


బందోబస్తుకు వచ్చిన పోలీసులు

# కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2:** ఎన్నికల నిబంధనల మేరకు జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు 55 మంది తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి వచ్చారు. అందులో అనంతపురం జిల్లాకొచ్చిన 39మందికి కలెక్టరు గౌతమి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.

| తహసీల్దార్ పేరు | కేటాయించిన స్థానం |
|---|---|
| పద్మావతమ్మ | అనంతపురం ఆర్డీఓ ఆఫీస్ |
| సుధాకరరావు | కళ్యాణదుర్గం |
| రామాంజినమ్మ | బొమ్మనహాళ్ |
| టీజీ మోహన్‌వలి | యాడికి |
| టీ.శ్రీనాథ్ | రాప్తాడు |
| జీఎం. కుమార్‌స్వామి | పెద్దపప్పూరు |
| వై. చిట్టిబాబు | రాయదుర్గం |
| బీ. హనుమంతు | కుందుర్పి |
| డీ. రవికుమార్ | కలెక్టరేట్ |
| డీ. లక్ష్మీనారాయణ | నార్పల |
| ఎం.హనుమంతునాయక్ | బుక్కరాయసముద్రం |
| జే. నిత్యానందబాబు | కంబదూరు |
| సీ. శ్రీదేవి | శెట్టూరు |
| టీ.వీ.సుబ్రహ్మణ్యం | అనంతపురంరూరల్ |
| జే. పరమేశ్వరస్వామి | ఆత్మకూరు |
| యు. దస్తగిరయ్య | విడపనకల్లు |
| ఎం. లోకేశ్వరి | గార్లదిన్నె |
| సీ.కే.శ్రీనివాసులు | ఉరవకొండ |
| హెచ్. హరినాథ్‌రావు | బెళుగుప్ప |
| మురహరి జయప్రసాద్ | యల్లనూరు |
| బీ. భారతి | గుత్తి |
| వి. చంద్రానాయక్ | పామిడి |
| జీ. రత్నారాధిక | కూడేరు |
| ఎస్. మహమ్మద్‌రఫీ | వజ్రకరూరు |
| యానంది వెంకటేశ్వర్లు | ల్యాండ్ రీఫామ్స్ అనంతపురం |
| అల్లూరు శేషఫణి | గుంతకల్లు |
| కొంగటి కుమారస్వామి | పెద్దవడుగూరు |
| కె. మల్లికార్జునస్వామి | పుట్లూరు |
| సతీష్ | కలెక్టరేట్ |
| కె. ఆంజనేయులు | తాడిపత్రి |
| ఎస్. శ్రీనాథ్ | కలెక్టరేట్ |
| కె. విజయకుమార్ | కలెక్టరేట్ |
| టీ. ఈశ్వరయ్య | బ్రహ్మసముద్రం |
| ఆర్. శేషరాంసింగ్ | కలెక్టరేట్ |
| ఎం. ఇందిరారాణి | కణేకల్లు |
| కె. శోభన్‌బాబు | శింగనమల |
| జీ. వెంకటేశ్వర్లు | గుమ్మఘట్ట |
| బీ. శివరామిరెడ్డి | అనంతపురం అర్బన్ |
| బీ. బాల ఈశ్వరరెడ్డి | డి.హీరేహాళ్ |

# సహజీవనం చేసి మోసం చేశాడు


- ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌పై మహిళ ఆరోపణ
- ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన


మీడియాతో మాట్లాడుతున్న అంజలి

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2:** ఏపీఎస్పీలో పని చేస్తున్న ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తనతో సహజీవనం చేసి మోసం చేశాడని అనంతపురం నగరానికి చెందిన అంజలి పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆమె తన కుమారుడితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ 2008లో తన భర్త కానిస్టేబుల్ ఇమాంసాబ్ పీటీసీకి శిక్షణ కోసం వచ్చిన సందర్భంలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ తన భర్తతో స్నేహం చేశాడన్నారు. ఆ క్రమంలో తరచూ తమ ఇంటి కి వచ్చేవాడని వెల్లడించారు. నీ భర్త శిక్షణ పూర్తయిన తరువాత ఎగ్జామ్ రాస్తాడని, ఆ పేపర్లు కనబడకుండా చేస్తానని తనను భయపెట్టి లొంగదీసుకున్నాడని ఆరోపించారు. ఈక్రమంలోనే భర్త తనకు దూరమ య్యాడన్నారు. 2009లో తమకు కుమారుడు పుట్టాడన్నారు. ఇలా ఇన్ని రోజులూ కాపురం చేసి ఇప్పుడు తన భార్యా పిల్లలకు ఈ విషయం తెలిసిందని చెప్పి తప్పించుకుంటున్నాడని, వారితో తమను తిట్టించాడని వాపోయారు. వారు తమను చంపుతామని, నడిరోడ్డులో ఉరేస్తామని బెదిరిస్తున్నారని అంజలి ఆరోపించారు. నీ భర్తకు స్లోపాయిజన్ ఇచ్చానని, నీ భర్త ఎక్కడో దూరంగా వెళ్లి చనిపోయాడని చంద్రశేఖర్ చెబుతున్నాడని తెలిపారు. ఆధార్‌కార్డులో తన పేరు తొలగించకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తాజాగా స్కూల్ ఫీజు కడతానని చెప్పి నగరంలోని ఓ లాడ్జిలోకి పిలిపించి చిత్రహింసలు పెట్టాడని ఆమె పేర్కొన్నారు. ఆధార్‌కార్డులో తన పేరు శ్రీనివాసులు అని చెప్పి సృష్టించాడని తెలిపింది. గొడవల నేపథ్యంలో అప్పటి డీఎస్పీ ఎ.శ్రీనివాసులుకు సమస్య విన్నవిస్తే త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులుకు రెఫర్ చేశారని, కానీ ఆ సీఐ కేసు కట్టనని చెప్పి వెనక్కు పంపారని తెలిపారు. ఆ తరువాత సీఐ ధరణికిషోర్‌ను విచారించమని చెప్పగా...చంద్రశేఖర్ వచ్చి రూ.16లక్షల డబ్బు, మూడు సెంట్ల స్థలమిస్తానని చెప్పి డీఎల్ఎస్‌లో క్లియర్ చేసుకుంటానని చెప్పాడన్నారు. ఆధార్‌కార్డులో తన పేరు తొలగిస్తే ఆ డబ్బు ఇస్తానని చెప్పాడన్నారు. అయితే సీఐ ధరణికిషోర్, చంద్రశేఖర్ ఏం మాట్లాడుకున్నారో తెలియదు కానీ సీఐ వచ్చి ఆధార్ కార్డులో పేరు మార్చమని చెప్పారన్నారు. ఆ తరువాత న్యాయవాది సమక్షంలో ఆధార్‌కార్డులో పేరు మార్చగానే ఎస్ఐ చంద్రశేఖర్ మాట మార్చారన్నారు. నీ భర్తను చంపినట్లే.. మిమ్మల్ని చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. చంద్రశేఖర్ భార్య సూర్యకుమారి, కుమార్తె తేజశ్విని, కొడుకు సాయికిరణ్ తనను చంపేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా తనకు ఎక్కడా న్యాయం జరగలేదని వాపోయారు. న్యాయం చేస్తామని చెప్పి ఎస్పీ కార్యాలయ వర్గాలు ఆమె సర్దిచెప్పి పంపారు.

# గ, హో.. ఓటర్లే !

- ఓటరు తుది జాబితాలో చిత్ర విచిత్రాలు
- చనిపోయిన వారి పేర్లు తొలగించని వైనం


సీరియల్ నెంబర్ 489 గ అనే పేరుతో నమోదైన ఓటు


సీరియల్ నెంబర్ 380లో మృతి చెందిన క్రిష్టయ్య ఓటు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 2:** ఓటరు తుది జాబితాలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఏ గ్రామంలోని ఓటరు జాబితా పరిశీలించినా తప్పులే కనిపిస్తున్నాయి. బత్తలపల్లిలోని జాబితాలో 106 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నెంబర్ 489లో గ అని, సీరియల్ నెంబర్474లో హో అనే పేర్లు జాబితాలో ఉన్నాయి. సీరియల్ నెంబర్ 105, 110లో బిల్లే విజయ పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. 55, 84లో షేక్ షరీఫ్ పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 191, 668, గోపాల్ అచారి కమ్మర పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 380 కిష్టయ్య మృతి చెందాడు. సీరియల్ నెంబర్ 265 రామప్ప మృతి చెందాడు. అయినా వారి పేర్లు తొలగించలేదు. వెంకటగారిపల్లి గ్రామంలో కేంద్రం 98లో సీరియల్ నెంబర్ 1, 129, 130, 131, 132లో గ్రామంలో లేని వారి పేర్ల మీద నకిలీ ఓట్లు ఉన్నాయని బీఎల్‌ఓలకు ఎన్నిసార్లు చెప్పినా వాటిని తొలగించలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

# ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా
- తుది ఓటరు జాబితాలో తప్పులపై అసంతృప్తి
- చేర్పులు, తొలగింపులపై నిత్యం మానిటరింగ్ చేయాలని ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, జేసీ తదితరులు

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2:** ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ఎవరు తప్పు చేసినా చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను హెచ్చరించారు. జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాలో తప్పులు, పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది నియామకాలు తదితర వాటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు, కలెక్టరేట్‌లో కలెక్టరు గౌతమి, జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవితోపాటు ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఎన్నికలు ఎపుడు వచ్చినా నిర్వహణకు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు తుది జాబితాలో తప్పుల పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా వస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలు, ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, తొలగింపుల పై నిరంతరం మానటరింగ్ చేయాలన్నారు. అందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపాలని ఆదేశించారు. పెండింగ్ క్లైయిమ్‌లను త్వరగా పరిష్క రించాలని సూచించారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడే పనిచేయాలని అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించు కుంటారని హెచ్చరించారు.

**ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు: కలెక్టరు**

సాధారణ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు గౌతమి ఎన్నికల కమిషన్ సీఈఓకు వివరించారు. పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పరిష్కారానికి చూస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియమించామని ఇప్పటికే సెక్టోరియల్ అధికారులు, ఏఎల్ఎంటీలకు తొలివిడత శిక్షణ పూర్తి చేశామని రెండోవిడత శిక్షణ వచ్చేవారంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలింగ్‌సిబ్బందిని గుర్తించామని, పోలింగ్‌కేంద్రాలలో వసతులు కల్పిస్తున్నామన్నారు. అక్రమంగా జిల్లాలోకి మద్యం, డబ్బు రాకుండా చేసేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిఘా ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గ్రంధివెంకటేష్, రాణిసుష్మిత, శీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు వెంకటేశ్వర్లు, కరుణకుమారి, వెంకటనారాయణమ్మ, వరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్,డీఐఓ రవిశంకర్, ఎన్నికల సెల్ అధికారులు, డీటీలు పాల్గొన్నారు.

# ఎస్‌జీటీ ఖాళీలు నాలుగేనట..!

- సోషల్ మీడియాలో వైరల్... డీఎస్సీ ఖాళీలపై మొదలైన కసరత్తు
- నేడు విజయవాడకు జిల్లా విద్యాశాఖాధికారులు

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 2:** నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ డీఎస్సీపై కదలిక మొదలైంది. నాలుగున్నరేళ్లుగా ఊరించిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌పై కసరత్తు ప్రారంభించింది. డీఎస్సీ పోస్టుల ఖాళీలపై శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీ పోస్టులు 4, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ -1 11 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ -2 27 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 53, గణితం 21, ఫిజికల్ సైన్స్ 12, బయాలజీ 6, సోషల్ స్టడీస్ 5, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 56 ఖాళీలు ఉండే అవకాశం ఉందంటూ...సోషల్ మీడియాలో ఉపాధ్యాయ పోస్టుల వివరాలు వైరల్‌గా మారాయి. అయితే జిల్లా విద్యాశాఖాధికారులు వాటిని ధ్రువీకరించడం లేదు.

- జిల్లా విద్యాశాఖాధికారులకు విజయవాడ నుంచి పిలుపు వచ్చింది. శనివారం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లనున్నారు. ఒక అసిస్టెంట్ డైరెక్టర్, ఒక సూపరింటెండెంట్, ఒక క్లర్క్‌ను ఖాళీలపై సమావేశంలో పాల్గొనడానికి విజయవాడకు రావాలంటూ.. పై నుంచి ఆదేశాలు వచ్చాయి. డీఎస్సీ ఖాళీలపై 4 లేదా 5వతేదీ స్పష్టత వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

### గవర్నర్‌ను కలిసిన వీసీలు

**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2:** రాష్ట్ర గవర్నర్‌ను జేఎన్‌టీయూ, ఎస్కేయూ వీసీలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వర్సిటీల వీసీలకు విజయవాడలో ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య గవర్నర్‌ను కలిశారు.

# ఆరోగ్యంపై దృష్టి సారించండి: ఎస్పీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2:** 'ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలుగుతాం. విధులతో పాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలి' అని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తన సిబ్బందికి సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన డీ మొబలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఆర్ ప్లటూన్లను పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మంచి ఆహారం వేళకు తీసుకోవాలని, యోగాసనాలు, ఎక్సర్‌సైజులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఉద్యోగంతో పాటు కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, బీవీ శివారెడ్డి, మునిరాజా, పలువురు సీఐలు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ టీచర్స్ జేఏసీ కార్యవర్గం ఎంపిక

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 2:** ఏపీ టీచర్స్ జేఏసీ ఉమ్మడి జిల్లా కొత్త కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చైర్మన్‌గా తనను, జనరల్ సెక్రెటరీగా ప్రభాకర్‌ను, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ట్రెజరర్‌గా పుల్లారెడ్డి, కో చైర్మన్లుగా ఓబిరెడ్డి, క్రిష్ణ ప్రసాద్, లస్కర్ నాయక్, యల్లప్ప, వైస్ చైర్మన్లుగా గోపాల్, గోపాల్‌రెడ్డి, కవిత, బాబయ్యను ఎంపిక చేశారన్నారు. సెక్రెటరీలుగా వెంకటరమణప్ప, ప్రసాద్‌రెడ్డి, క్రిష్ణకుమార్, నాగేంద్ర గౌడ్, పబ్లిసిటీ సెక్రెటరీగా శివారెడ్డిని రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగులకు మధ్యంతరభృతి, 2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్ పునరుద్ధరణ తదితర అంశాలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



పర్తియాత్రను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

## వైభవంగా పర్తియాత్ర

**పుట్టపర్తిరూరల్ ఫిబ్రవరి 2:** కరీంనగర్ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తుల పర్తియాత్ర పట్టణంలో శుక్రవారం అత్యంత వైభవంగా సాగింది. కరీంనగర్ జిల్లాకు చెందిన 2500 మంది సత్యసాయి భక్తులు శుక్రవారం సాయంత్రం పట్టణానికి చేరుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్థానిక హనుమాన్ కూడలి వద్ద సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించి పర్తియాత్రను ప్రారంభించారు. భక్తులు తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను మేళవిస్తూ బతుకమ్మ సంబరాలు చేశారు. సాయినామస్మరణతో పురవీధుల్లో సందడి చేశారు. పర్తియాత్రలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ వేషధారణలతో పలువురు భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



బతుకమ్మలతో యాత్రను నిర్వహిస్తున్న కరీంనగర్ భక్తులు

## కుష్ఠుపై అవగాహన

**పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 2:** క్రమం తప్పకుండా మందులు వాడితే కుష్ఠువ్యాధిని నయం చేయవచ్చునని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ప్రజలకు సూచించారు. మండలంలోని రాచువారిపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచు గంగమ్మ అధ్యక్షతన కుష్ఠుపై, డ్రైడే,ఫ్రైడేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. శరీరం మీద రాగిరంగులో స్పర్శలేని మచ్చలు, బుడిపెలు, కనుబొమ్మలపై వెంట్రుకలు ఊడిపోవడం వంటి లక్షణాలు ఉన్నా.. నరాలు ఉబ్బినట్లుగా ఉండి నొప్పి అనిపించినా.. వెంటనే స్థానిక ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు తెలియచేసి వైద్యం పొందాలన్నారు. కుష్ఠు అని నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. తద్వారా ఆ వ్యాధిని నయం చేయవచ్చన్నారు. ఇక ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల బారిన పడకుండా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి శ్రీకళధర్, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంపీపీ స్కూల్ టీచర్ పార్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్‌భాస్కర్, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 10లోగా ఈక్రాప్ నమోదు చేయించాలి



గౌకనపల్లి వేరుశనగ పొలంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 2:** మండలంలో రబీలో సాగు చేసిన పంటలను ఈనెల 10వ తేదీలోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని వెలిచెలమల, గౌకనపల్లి, మరికొమ్మెదిన్నె గ్రామాల్లో జరుగుతున్న ఈ పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రబీలో నాలుగు వేల ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగుచేశారన్నారు. ఇప్పటికి రైతులు దాదాపు 80శాతం పైగా ఈపంట నమోదు చేయించారన్నారు. మిగిలిన వారు 10తేదీ లోపు చేయించాలని తెలిపారు. అలాగే మండలంలో రైతులు పండించిన కందులను క్వింటాల్ రూ.9,200లతో ఏపీసీడ్స్ సహకారంతో కొనుగోలు చేస్తామని ఏఓ తెలిపారు. కంది పండించిన ప్రతి రైతు ముందుస్తుగా ఆర్బీకేలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గౌకపల్లిలో పెద్ద గంగిరెడ్డి సాగుచేసిన కందిలో పంటకోత ప్రయోగాలు చేశారు. ఆయన వెంట వీహెచ్ఏలు, వీఏఏలు , రైతులు ఉన్నారు.

## ప్రభుత్వ స్థలాలను చదును చేయకూడదు

**నంబులపూలకుంట, ఫిబ్రవరి2:** ప్రభుత్వ స్థలా ల్లో అనుమతులు లేకుండా చదును చేయడం కానీ, ని ర్మాణాలు చేపట్టడం కానీ చేయకూడదని తహసీల్దార్ నరేంద్రకుమార్ సూచించా రు. మండలకేంద్రంలోని కది రి, రాయచోటి ప్రధాన రహదారి నుంచి వంకమద్దికి వెళ్లే రోడ్డు పక్కన స్థలాన్ని ఇటీవల ఓ వ్యక్తి చదును చేసి షెడ్ నిర్మించాడు. దీన్ని గమనించిన పలువురు స్థానికులు సైతం నిర్మాణాలు చేపట్టేందుకు గాను శుక్రవారం జేసీబీతో ప్రభుత్వ భూమిని చదును చేసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఆ భూమి వద్దకు వెళ్లి పనులను నిలిపి వేయాలించారు. ఈ క్రమంలో సీపీఎం, రైతు సంఘం నాయకులు అధికారులలో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు పనులు నిలిపివేస్తున్నామని, తహసీల్దార్ అనుమతులు పొందిన తరువాత పనులు చేసుకోవాలని వీఆర్వోలు దీపిక, కిష్టప్ప సూచించారు. ఇదిలా ఉండగా తహసీల్దార్ ఫోన్ ద్వారా గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా చదును చేయడం , నిర్మాణాలు చేపట్టడం చేయకూడదని తెలిపారు. అలా చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

## కొనసాగిన భవన నిర్మాణ కార్మికుల రిలేదీక్ష

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 2:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలేదీక్ష శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. వీరికి సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, టీఎంటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నిజాం, మండలాధ్యక్షుడు మండెం చాంద్‌బాషా, సీపీఎం నాయకుడు సున్నంపల్లి రమణ సంఘీభావం తెలిపారు. పలువురు భవన కార్మికులు మాట్లాడుతూ వెంటనే తమకు ఇంటిపట్టాలివ్వాలన్నారు. అలాగే తమ సమస్యల్ని తేర్చే వరకు దీక్ష విరమించేదిలేదని పేర్కొన్నారు.

## కుట్టుమిషన్లు ఇప్పించాలని వినతి

**కదిరిఅర్బన్, ఫిబ్రవరి 2:** పట్టణంలోని సైదాపురంలో పేదరిక నిర్మూలన సంస్థ పేరుతో 45రోజులపాటు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చారు. అయితే శిక్షణ పూర్తి అయిన తరువాత ఆ సంస్థ వారు తమకు సర్టిఫికెట్‌కానీ, మిషన్లుకానీ ఇవ్వలేదని, ఇస్తామంటూ రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, న్యాయం చేయాలని బాధితులు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి అయినా, మిషన్లు ఇవ్వడం లేదన్నారు. సంస్థపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు రాజేష్, బాధిత మహిళలు చంద్రకళ, శిల్పరాణి, మునీంద్రమ్మ, శ్రీదేవి, అంజనమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అటవీభూమిని ఆక్రమిస్తే చర్యలు

**తాడిమర్రి, ఫిబ్రవరి 2:** అటవీశాఖకు సంబంధించిన భూమిని ఎవరైనా సెంటు ఆక్రమిస్తే చర్యలు తప్పవని పీలేరు డీఎఫ్ఓ సుబ్బారెడ్డి హెచ్చరించారు. మండలంలోని తురకవారిపల్లి సమీపంలోని 854 సర్వేనెంబరులో వివాదాస్పద భూమిని ఆయన పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. అటవీశాఖకు సంబంధించిన 3.30 ఎకరాల భూమిలో 30 ఏళ్లగా పార్నపల్లికి చెందిన రైతు అనుభవంలో ఉన్నట్లు లెక్కతేల్చారు. అందులో ప్రస్తుతం అరటిపంట ఉండటంతో.. 3 నెలల్లోగా ఖాళీ చేస్తామని, సమయం ఇవ్వాలంటూ రైతు కోరారు. అందుకు డీఎఫ్ఓ అంగీకరించి అగ్రిమెంట్ రాసుకున్నారు. అదేవిధంగా 992 సర్వేనెంబరులోని 7.50ఎకరాల భూమిని కూడా ఆయన పరిశీలించారు. అటవీభూములను ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం డీఆర్వో హుస్సేనప్ప, పుట్లూరు ఎఫ్ఎస్ఓ ప్రవీణ్, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు సూర్యనారాయణ, వెంకటేశులు, రైతులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు



ధర్మవరంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు



ధర్మవరం మండలం మల్లేనిపల్లిలో ..



ముదిగుబ్బ మండలం ఆకుతోటపల్లిలో..

**బుక్కపట్నం, ఫిబ్రవరి 2:** వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. అక్రమాలు, అవినీతితో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం గాడిన పడుతుందని చెప్పారు. ఇందుకు వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలు, వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, నాగరాజు, శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టీడీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

**ధర్మవరం:** తెలుగుదేశం పార్టీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసు ధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని చంద్రబాబునగర్‌లో వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మార్కెట్‌యార్డు వద్ద గల శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ.. మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డిని గద్దె దించడానికి వారు సిద్ధంగా ఉన్నారన్నారు. మరో 70 రోజుల్లో ప్రజారంజక ప్రభుత్వం రాబోతుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేసి అర్హులందరికీ న్యాయం చేస్తారని పేర్కొన్నారు. టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, కాచర్లకంచన్న, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, అంబటిసనత్, రాళ్లపల్లిషరీఫ్, చట్టాలక్ష్మీనారాయణ, బడిగింజల రమణ, బొట్టుకిష్ట, మారుతీస్వామి, గోసలశ్రీరాములు, మాధవరెడ్డి, అత్తర్‌రహీం, కరెంటు ఆది, జిలకరశీన, ఊట్ల నరేంద్ర, అమరా కేశవనాయుడు, కేశగాళ్ల శీన, పల్లపు రవి, అడ్రామహేశ్, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

### మల్లేనిపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ..

**ధర్మవరంరూరల్:** మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు మండల ప్రచారకమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంచారు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాలన్నీ అభివృద్ధి బాటపడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ మద్దిలేటి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, రాఘవరెడ్డి, అశ్వర్థనాయుడు, భాస్కర్‌చౌదరి, విజయ్‌చౌదరి, మల్లేనిపల్లి చంద్ర, జంగం నరసింహులు, తుమ్మలనరసింహరెడ్డి, చిత్రారామ్మోహన్, నేలకోటభాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ముచ్చురామిక్రిష్ణ పాల్గొన్నారు.

### ఆకుతోటపల్లి, గుట్టకిందపల్లిలో..

**ముదిగుబ్బ:** మండలంలోని ఆకుతోటపల్లి, గుట్టకిందపల్లి గ్రామాల్లో తెలుగుదేశం శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, అశ్వర్థరెడ్డి, కనుమచంద్ర, శేఖర్‌రాజు, కోట్లబాబి, గోపాల్‌రెడ్డి, ఆనంద్, మహబూబ్ పీరా, తుమ్మలసూరి, రవి, చలమప్ప తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పార్టీ శ్రేణులకు నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

**కదిరి, ఫిబ్రవరి 2:** వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు దగ్గరపడ్డాయని, కేవలం 70రోజుల్లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కనుక టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందరూ సమష్టిగా ఉండి పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వ్యతిరేక పోస్టులను, పుకార్లను నమ్మరాదని తెలిపారు. చంద్రబాబు కదిరి నడిబొడ్డున నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించారని గుర్తు చేశారని, అందులో ఎంటువంటి మార్పు లేదని అన్నారు. వైసీపీలో కొంతమంది ఇలాంటి అసత్య ప్రచారాలు రేపుతున్నారని తెలిపారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికలో టీడీపీ గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యర్థులు చేసే అసత్యప్రచారాలను నమ్మకుండా కేవలం టీడీపీ విజయంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. అధికారంలోకి రాగానే 20 ఏళ్లుగా తనను నమ్ముకున్న ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కీలక సమయంలో కార్యకర్తలు, నాయకులు ఇతర అంశాలపై దృష్టి పెట్టకుండా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించే పనిలో ఉండాలని సూచించారు. సమావేశంలో నాయకులు మోపూరి శెట్టి చంద్రశేఖర్, 14వ వార్డు కౌన్సిలర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు

# విధుల పట్ల చిత్తశుద్ధితో ఉండాలి

- పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ సూచన



పరేడ్ గ్రౌండ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

**పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 2:** చిత్తశుద్ధితో విధులను నిర్వర్తించి పోలీసుశాఖకు, జిల్లాకు మంచిపేరు తేవాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. పట్టణంలోని శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం యాన్యువల్ మొబలైజేషన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఏఆర్ విభాగం పాత్ర అత్యంత కీలకమన్నారు. జిల్లాలో పోలీసుయంత్రాంగం బాగా పని చేస్తోందన్నారు. ఈమొబలైజేషన్‌లో ఫైరింగ్‌ప్రాక్టీస్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మాబ్‌కంట్రోల్, బీడీటీం, వీవీఐపీ ఎస్కార్టు, పీఎస్ఓ గార్డు డ్యూటీలు, బందోబస్తు, ప్రవర్తనా నియమాలు, ఆరోగ్యం మొదలైన అన్ని అంశాలపై మంచి తర్ఫీదు పొందారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే కాలంలో విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతకు మునుపు సాయుధబలగాలు నిర్వహించిన పరేడ్‌లో ఎస్పీ గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్ఐలు , ఆర్ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డీలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కేజీబీవీ ఎస్ఓ

**తాడిమర్రి, ఫిబ్రవరి 2:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు కబడ్డీలో ప్రతిభ కనబరిచారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో గత నెల 28వ తేదీన జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఫైనల్‌కు చేరి రన్నర్స్‌గా నిలిచి బహుమతిని సాధించినట్లు పాఠశాల ఎస్ఓ వాణిశ్రీ తెలిపారు. విద్యార్థినులను ఎస్ఓతో పాటు పీఈటీ కవిత, ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

## ఎస్‌జీఎఫ్ రాష్ట్ర జట్టుకు విద్యార్థిని ఎంపిక

**కదిరి అర్బన్, ఫిబ్రవరి 2:** ఎస్‌జీఎఫ్ రాష్ట్ర జట్టుకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పట్టణంలోని సాధన పాఠశాల హెచ్ఎం సాదిక్ తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా నరసారావు పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల అండర్ 17 క్రికెట్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు తరపున తేజశ్వని పాల్గొని ప్రతిభ కనబరచిందన్నారు. దీంతో జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన తేజశ్వనిని సీనియర్ కోచ్ నజీర్, పీఈటీ సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## గ్రామాల్లో ప్రచార రథం పర్యటన

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 2:** అయోధ్య సీతారాముల కల్యాణ మహోత్సవ ప్రచార రథం మండలంలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం దేవరపల్లి, వర్రావాండ్లపల్లి, పడమరనడింపల్లి, వెలిచెలమల, శ్రీరామాపురం, వడ్డిపల్లి, గౌకనపేట,కమ్మగుట్టపల్లి, దిన్నెమీదపల్లి, తూర్పునడింపల్లి, ఆసంవారిపల్లి, జౌకల, మరికొమ్మెదిన్నె, నంబులపూలకుంట గ్రామాల్లో పర్యటించింది. ఆయాగ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో రథానికి స్వాగతం పలికారు. ఈ నెల 21వతేదీన కదిరి పట్టణంలోని బాలుర ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు కిసాన్‌మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ రామమోహన్ తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వెంకటేష్, మండలాధ్యక్షుడు చంద్రమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గురివిరెడ్డి, నాగరాజు, షమీవుల్లా, గోరవర్ధన్, రవీంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.



తూర్పు నడింపల్లిలో పర్యటిస్తున్న సీతారాముల కల్యాణోత్సవ ప్రచార రథం

## ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

**ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 2:** మండలంలోని చిగిచెర్ల గ్రామం వద్ద ప్రధాన రహదారిలో స్పీడ్‌బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు శుక్రవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని కోట బసవన్నవీధికి చెందిన మిడతల అశోక్(30) కబోర్డుల పని నిమిత్తం అనంతపురానికి బైక్‌లో వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ధర్మవరానికి వస్తుండగా.. మార్గంమధ్యలోని చిగిచెర్ల క్రాస్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి ఎగిసిపడింది. ప్రమాదంలో అశోక్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేసుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కేసు నమోదు చేసుకున్నారు.

## బదిలీ పోలీసు అధికారులకు ఘనసన్మానం



బదిలీ అయిన పోలీసు అధికారులతో ఎస్పీ మాధవరెడ్డి

**పుట్టపర్తిరూరల్ ఫిబ్రవరి 2:** సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ముగ్గురు ఆర్ఐలు, నలుగురి ఆర్ఎస్సైలు బదిలీ అయ్యారు. అయితే జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం వీరందరికీ తోటి సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా, జిల్లాపోలీసు కార్యాలయంలో ఆర్ఐలుగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, టైటాస్, నారాయణ, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్రనాథరెడ్డి, సీఐలు నారాయణరెడ్డి, సూర్యనారాయణ, ఆర్ఎస్సైలు రాజా, ప్రదీప్‌సింగ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. వీరందరిని ఎస్పీ మాధవరెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. అలాగే ఇటీవల పదవీ విరమణ పొందిన ఏఎస్సై మహమ్మద్‌సాలార్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణస్వామిని కూడా ఎస్పీ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీ కమిషనర్‌కు సన్మానం

**కదిరి, ఫిబ్రవరి 2:** సాధారణ బదిలీల్లో భాగంగా పట్టణ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు అనంతపురానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఈయనకు పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఆయన చేసిన సేవల్ని కొనియాడారు.

## టీడీపీ కార్యకర్తకు పరామర్శ

**బత్తలపల్లి, ఫిబ్రవరి 2:** మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శివయ్యపై వైసీపీ సర్పంచ్ జయచంద్రారెడ్డి దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుట్ల విజయ్ కుమార్ శుక్రవారం తంబాపురం గ్రామానికి వెళ్లి శివయ్యను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో వైసీపీ సర్పంచ్ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. గిరిజనుడు అయిన శివయ్యపై సర్పంచ్ దాడులు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసులు,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓగా నాగప్రసాద్ బాధ్యతలు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 2:** మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నూతన ఎంపీడీఓగా శివనాగప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసే సాయి మనోహర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పని చేసే శివనాగప్రసాద్ వచ్చారు.

## నూతన ఎంపీడీఓగా రాణెమ్మ

**నల్లచెరువు, ఫిబ్రవరి 2:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నూతన ఎంపీడీఓగా రాణెమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఆస్పరి ఎంపీడీఓగా ఉన్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శకుంతలమ్మ కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎండీపీఓ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు స్వాగతం పలికారు.

## నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

**ధర్మవరం, ఫిబ్రవరి 2:** నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం నిండా మోసం చేసిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న విమర్శించారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శుక్రవారం సత్యసాయిజిల్లా డీవైఎఫ్ఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. ప్రస్తుతం 6100 డీస్సీ పోస్టులను మాత్రమే విడుదల చేయడం దారుణమన్నారు. తక్షణమే మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకుడు సాకేహరికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ రైతు సంఘం కమిటీ ఎన్నిక

**ముదిగుబ్బ, ఫిబ్రవరి2:** మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ పేర్కొన్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా డాబా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, గౌరవాధ్యక్షుడిగా గుంజేపల్లి కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా ఈశ్వర్‌నాయక్, తుమ్మలచిన్నప్ప, వెంగముని, కమిటీ సభ్యులుగా శంకర, లింగప్ప, దామోదర, ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

**బత్తలపల్లి, ఫిబ్రవరి2:** మండలకేంద్రం శివార్లలో శుక్రవారం పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం వారి వద్ద నుంచి 11,040 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 2:** మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో గత నెల 29వ తేదీన జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన మహమ్మదాబాద్ గొల్లపల్లికి చెందిన ప్రసాద్ (35) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్ గొల్లపల్లికి చెందిన ప్రసాద్, అతని భార్య రాధ ఆటోలో కదిరికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో గాయడిన ప్రసాద్‌ను చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుంగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

**నల్లచెరువు, ఫిబ్రవరి 2:** మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఇందులో వృత్తి విద్యాకోర్సులలో చేరిన విద్యార్థులు ఎలా ఉద్యోగ ప్రయోజ నాలు పొందవచ్చనన్న విషయాలను వివరించారు. 8, 10వ తరగతులతో పాటు ఇంటర్ పాసైన విద్యార్థులను గ్రామ సచివాలయం -2 కు తీసుకెళ్లి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ ఎనేబుల్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వృత్తివిద్య ఉపాధ్యాయురాలు జ్యోతి ఆధ్వర్యంలో, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్‌నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 నుంచి వీరకేతమ్మ ఉత్సవాలు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 2: మండలంలో ప్రసిద్ధి చెందిన వీరకేతమ్మదేవి బ్రహ్మరథోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సేవా ట్రస్టు వారు తెలిపారు. 10న కలశస్థాపన, ధ్వజారోహణం, జ్యోతుల ఉత్సవం, కల్యాణోత్సవం జరుగుతాయని తెలిపారు. 11న ఉదయం అభిషే కాలు, చండీయాగం, నాగదేవతాహోమం, రథాంగ హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనున్నట్లు తెలిపారు.

## రేపు వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ఠ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పోరాటాల వీరుడు వడ్డె ఓబన్న అని వడ్డెర్ల సంఘం, యువజన సంఘ నాయకులు పేర్కొన్నారు. వారు శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 4న వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించ నున్నట్లు తెలిపారు. వడ్డెర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం నాయకులు రంగప్ప, ప్రసాద్, నాగరాజు, వెంకటేష్, హనుమయ్య, అక్కులప్ప, అశ్వత్థప్ప, దుర్గానవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 5న షర్మిల పర్యటన

మడకశిరటౌన్, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఈనెల 5వ తేదీన మడకశిర పట్టణంలో పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. ఆయన ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. షర్మిల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మడకశిర పట్టణానికి చేరుకుంటారని తెలిపారు. వాల్మీకి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, రాజీవ్‌గాంధీ సర్కిల్ మీదుగా రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## గోరంట్ల ఎంపీడీఓగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

గోరంట్ల, ఫిబ్రవరి 2: స్థానిక ఎంపీడీఓగా ఎంజీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లాలోని గోనేగండ్ల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనను ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో గోరంట్లకు నియమితులయ్యారు. గోరంట్ల ఎంపీడీఓగా పని చేస్తున్న రఘునాథ్ గుప్తా కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

### గుడిబండ ఎంపీడీఓగా బంగారమ్మ..

గుడిబండ, ఫిబ్రవరి 2: స్థానిక మండలపరిషత్ అధికారిగా బంగారమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తనను కర్నూలు జిల్లా నుంచి శ్రీ సత్యసాయిజిల్లాకు ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు ఆమెను తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రామారావు కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈఓఆర్డీ నాగరాజునాయక్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

### నూతన ఎస్ఐ వీరేష్...

అగళి, ఫిబ్రవరి 2: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వీరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచే స్తున్న ఎస్ఐ లావణ్య తిరుపతికి బదిలీకావడంతో ఆమె స్థానంలో పుట్టపర్తి క్యాంపస్‌లో విధులు నిర్వహించే ఎస్ఐ వీరేష్‌ను ఇక్కడకు నియమించారు. ఎన్నికల బదిలిల్లీ భాగంగానే అగళి ఎస్ఐగా వీరేష్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది, ప్రజల సహకారంతో చర్యలు తీసుకుంటానన్నారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన సవిత



మాజీ సర్పంచ్ అశ్వత్థనారాయణతో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 2: మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ అశ్వత్థనారాయణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పరామర్శించారు. ఆయన నెల కిందట మోకిలికి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమె శుక్రవారం బోయగేరిలోని మాజీ సర్పంచు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరాతీశారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ 2024లో జరిగే ఎన్నికలకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. బోయ సమాజిక వర్గాన్ని చైతన్యపరచాలని, అధికార పార్టీ వైసీపీ దురాగతాలపై బీసీలకు వివరించాలని ఆమె ఆయనను కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, మాధవనాయుడు, గుట్టూరు సూరి, వాసుదేవరెడ్డి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడికి...

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు నీరుగంటి నాగరాజు తల్లి అనసూయమ్మ(80) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెం దారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత మావటూరుకు వెళ్లారు. అనసూయమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు మావటూరు గోపాల్, నాగరాజు, నరసింహప్ప, ముద్దన్న, ప్రసాద్, వాసుదేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## హైవోల్టేజీతో టీవీలు, ఫ్యాన్లు దగ్ధం

పెనుకొండ, ఫిబ్రవరి 2 : పట్టణంలోని పంచాంగం వీధిలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ హైవోల్టేజీ కారణంగా టీవీలు, ఫ్యాన్‌లు, ఫ్రిడ్జ్‌లు, బల్బులు ఒక్కసారిగా కాలిపోయాయి. సాయంత్రం ఉన్నఫలంగా విద్యుత్ అధిక లోడ్ సరఫరా కావడంతో శంకరమఠం నిర్వాహకుడు శేషస్వామి తదితరుల ఇళ్లలో టీవీలు, ఫ్యాన్‌లు, బల్బులు కాలిపోయాయి. వెంటనే వినియోగదారులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో వారు విద్యుత్‌లైన్ ఆపి మరమ్మతు చర్యలు చేపట్టారు. హైవోల్టేజీవల్ల తమ ఇళ్లలోని ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయని ఆ నష్టాన్ని విద్యుత్‌శాఖ వారే ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు.

# టీడీపీతోనే బీసీలకు గుర్తింపు

జయహో బీసీ సదస్సులో నాయకులు



చిలమత్తూరులో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య

చిలమత్తూరు, ఫిబ్రవరి 2: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు చలవతోనే రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు వచ్చిందని, అనంతరం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడితో బీసీలకు అన్ని విధాలా న్యాయం దక్కిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సభను నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు కొడికొండ బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవన హళ్లి ఆనంద్, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వెంకట్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కొల్లుకుంట అంజనప్ప, రా మాంజనమ్మ, మాజీ కార్యదర్శి దేమకేతేపల్లి అంజనప్ప తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అణగారిన కులాలను సమాజం నుంచి బయటికి తీసి వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఆయన అడుగుజాడల్లోనే చంద్రబాబు పయనిస్తూ బీసీలే టీడీపీకి వెన్నెముక అనుకొని వారి కోసం అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో బీసీలపై జరుగుతున్న దాడులు, రాజకీయ కంగా వారిని వాడుకుంటున్న తీరు ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. వైసీపీ నాయకులు కూడా బీసీ పదం వాడుతూ బీసీలను మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ పన్నాగాలను తిప్పుకొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి బీసీ కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, నాయకులు నందీశప్ప, రామప్ప, శ్రీదేవి, బేకరీ గంగాధర్, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, మీసేవ సూరి, రంగప్ప, నంజుండప్ప, లక్ష్మీనరసప్ప, తిప్పారెడ్డి, జనసేన నాయకులు రమణ, ప్రవీణ్, అగ్నిసేన తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు శుక్రవారం లేపాక్షిలో జయహో బీసీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఉన్న తెలుగు తమ్ముళ్లు హాజరై జయ హో బీసీ అంటూ నినాదాలు చేశారు. నంది విగ్రహం నుంచి లేపాక్షి సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బైక్ ర్యాలీలో తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో పా ల్గొన్నారు. అనంతరం ఆర్‌జెహెచ్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు కుంటుమద్ది రంగయ్య మాట్లాడుతూ... బీసీలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను అక్రమ కేసుల్లో ఇరికించి అణగదొక్కేందుకు చాలా ప్రయత్నాలు చేసిందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్న తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ఏకతాటిపై నడవాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.



లేపాక్షి సభలో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ జయప్ప

# పనులు చేసి ఏడాదైనా.. బిల్లులు ఏవీ?

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీని నిలదీసిన వైస్ ఎంపీపీ



ఎంపీపీని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ అంజలీదేవి

చిలమత్తూరు, ఫిబ్రవరి 2: 'ఎస్సీలంటే చులకనగా చూడకండి... మేము చేసిన అభివృద్ధి పనులకు ఏడాది కావస్తున్నా నిధులు మంజూరు చేయట్లేదు. నేను మండల వైస్ ఎంపీపీగా ఉన్నా కనీస గౌరవం లేదు.' అంటూ మండల వైస్ ఎంపీపీ అంజలీ దేవి ఎంపీపీ పురుషోత్తం రెడ్డిని సర్వసభ్య సమావేశంలో నిలదీశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వైస్ ఎంపీపీ, ఎంపీపీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక దశలో కోడూరు-1 ఎంపీటీసీ, వైస్ ఎంపీపీగా ఉన్న అంజిలీదేవి తీవ్ర ఆగ్రహానికి గురై తమకు అందాల్సిన నిధుల గురించి ఎంపీపీని నిలదీశారు. మధురేపల్లికి రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ గ్రామస్థులు అప్పట్లో ఆందోళన చేశారు. దీంతో సుమారు రూ.4 లక్షల నిధులతో రోడ్డు పనులు చేపట్టేందుకు సభలో తీర్మానం చేసి పనులు ప్రారం భించారు. ఆ సభకు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి రాకవడంతో ఒకటో వైస్ ఎంపీపీ బయప్ప ఆధ్యక్షతన సభ నిర్వహించి తీర్మానం చేశారు. రోడ్డు పనులు పూర్తి అయి సంవత్సరం గడిచినా నిధులు మంజూరు చేయకపోవడంపై వైస్ ఎంపీపీ అంజలీదేవి ఎంపీపీని నిలదీశారు. సభ్యులపై వివక్ష తగదన్నారు. దీనికి ఎంపీపీ బదిలిస్తూ తీర్మానం చేసిన సభలో తాను లేనని, ఆ పనులకు సంబంధించి ఇప్పటివరకు తనకు సమాచారం లేదన్నారు. అయితే వైస్ ఎంపీపీ అంజలీదేవి మాట్లాడుతూ కావాలనే తాము చేసిన పనులకు నిధులు మంజూరు చేయట్లేదన్నారు. వైస్‌ఎంపీపీగా ఉన్నా ఒక్క పని కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నామని సభలో ఆవేదన వ్యక్తం చేశారు.

## కేంద్రానిది అబద్ధాల బడ్జెట్

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్ధాల బడ్జెట్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి సంబంధిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. విద్యార్థినుల కు సంబంధించి 28 శాతం ఎన్‌రోల్ పెరిగిందని, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా ఉందని, ప్రపంచంలోనే ఇది అత్యుత్త మమైన విద్యావిధానమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యార్థులు చదువులకు దూరమయ్యారన్నారు. కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయా పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయన్నారు. ప్రభుత్వమే 390కి పైగా యూనివర్సిటీలకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఏకలవ్య, సైనిక్ స్కూళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదన్నారు.

## యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 2: గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన మోహన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోహన్ మడకశిర పట్టణంలోని ఓ దుకాణంలో కూలీ పనిచేస్తున్నాడు. పని ముగించుకుని గురువారం రాత్రి 11 గంట సమయంలో ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో కాపు కాచి గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసినట్లు తెలిపారు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. పోలీసులు వెంటనే గ్రామానికి వచ్చి జరిగిన సంఘటనపై గ్రామంలో ఆరాతీశారు. రాత్రి కావడంతో ఆచూకీ తెలియరాలేదు. గాయపడిన మోహన్‌ను వెంటనే మడకశిర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. మోహన్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## మందు పిచికారి చేసిన గడ్డి తిని 42 గొర్రెల మృతి

పావగడ, ఫిబ్రవరి 2: తాలూకా పరిధిలోని వడ్రేవు గ్రామంలో శుక్రవారం పురుగుల మందు పిచికారి చేసిన గడ్డితిని 42 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన మేరకు... వడ్రేవు గ్రామానికి చెందిన గోపాల, అంజప్ప శుక్రవారం తమ గొర్రెలు, మేకలను తమ వ్యవసాయ తోట సమీపంలో ఉన్న బొప్పాయి తోటలోకి మేతకు తోలుకెళ్లారు. అవి అక్కడ మేస్తూ మేస్తూ పక్కనే ఉన్న టమోటా, కర్బూజా తోటలోకి వెళ్లాయి. అందులో ఆ పంటల కోసం పురుగుల మందు పిచికారి చేసిన గడ్డిని తిని 42 గొర్రెలు మృతి చెందాయి. ఇటీవల ఒక్కో గొర్రెను రూ.12వేలతో కొనుగోలు చేశామని, చనిపోయిన వాటి వాటి విలువ ప్రస్తుతం రూ.4.50లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పరిశీలించి నష్టపరిహారం అందించాలని కోరారు. సంఘటన స్థలానికి పశు సంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ అశ్వత్థ నారాయణ, డాక్టర్ వరెకెరప్ప వెళ్లారు. గొర్రెల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

## పింఛన్ సొమ్ములో ఇంటి పన్ను కోత



పింఛన్ సొమ్ములో కోత విధించి ఇచ్చిన ఇంటిపన్ను రసీదు

రొద్దం, ఫిబ్రవరి 2: మండలంలోని డీఆర్ కొట్టాల గ్రామంలో పింఛన్ సొమ్ములో ఇంటి పన్ను కోత పెట్టి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పింఛన్ సొమ్ము రూ.3 వేలలో ఇంటి పన్ను రూ.200 కటింగ్ చేసి, మిగిలిన రూ.2800 వలంటీరు అందజేశాడు. దీనిపై లబ్ధిదాఉలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 25 మంది పింఛన్‌దారులున్నారు. పింఛన్ సొమ్ములో రూ.200 పట్టుకుని ఇంటి పన్ను రసీదు అందజేశారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

## 'ట్రాన్స్‌పోర్ట్ బంద్‌ను విజయవంతం చేయండి'

పెనుకొండ, ఫిబ్రవరి 2: డ్రైవర్లను జైలుపాలుచేసే హిట్‌అండ్‌రన్ చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న చేపట్టిన దేశ వ్యాప్త ట్రాన్స్‌పోర్ట్ బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రఫీక్, పెడబల్లిబాబా పేర్కొన్నారు. బంద్‌కు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ చట్టం అమలైతే డ్రైవర్ల జీవితాలు అధోగతి పాలవుతాయన్నారు. ప్రమాదాలు అనేక కారణాల వల్ల జరుగుతుం టాయని కేవలం డ్రైవర్లదే తప్పుకాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని పట్టించుకోకుండా ప్రమాదాలు కేవలం డ్రైవర్లవల్లే జరుగుతున్నాయన్న నెపంతో ఇలాంటి భారీ శిక్షలు విధించడం సరైంది కాదన్నారు. దీనిపై పునరా లోచించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, ఆటో యూనియన్ నాయకులు నాగప్ప, భాష తదితరులు పాల్గొన్నారు.

## తూనికల శాఖ అధికారుల దాడులు

హిందూపురం, ఫిబ్రవరి 2: పరిగిలోని పలు దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చౌకదుకాణాన్ని తనిఖీచేశారు. వాహనం ద్వారా సరఫరా చేసే రేషన్ బియ్యం తూకాల్లో తేడా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదుచేశారు. అదేవిధంగా శీతల పానీయాల దుకాణంపై దాడులు నిర్వహించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని కేసు నమోదుచేశారు. పరిగి, పైడేటి, విట్టాపల్లి, సీతారాంపురం కాలనీల్లో ఆయా దుకాణాలపై కేసులు నమోదుచేసినట్లు తూనికలు, కొలతలశాఖ అధికారి శివశంకర్ తెలిపారు. వీరికి జరిమానా విధించినట్లు తెలిపారు. ఎక్కడైనా తూకాల్లో తేడా, ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయనతెలిపారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

భయాందోళనల్లో రైతులు



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని చూపుతన్న రైతు రామాంజి, (ఇన్‌సెట్‌లో) అడుగుభాగం విరిగిపోయి ఉన్న దృశ్యం

రొద్దం, ఫిబ్రవరి 2: మండలపరిధిలోని ఆర్ మరువపల్లిలో ఓ నర్సరీ వెనుకభాగాన పెద్దగువ్వలపల్లికి వెళ్లే ఎల్‌టీ లైనుకు సంబంధించిన విద్యుత్ స్తంభం చాలా ప్రమాదకర పరిస్థితిలో ఉంది. అడుగుభాగాన విరిగిపోయి ఎప్పుడు కూలుతుందో, ఏ ప్రమాదం పొంచి ఉందో అని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ప్రమాదకరంగా ఉన్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రొద్దం మండల పరిధిలోని ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన రైతులు రామాంజి, నారాయణ స్వామికి ఆర్ మరువపల్లిలో నర్సరీ వెనుకభాగాన పొలం ఉంది. ప్రస్తుతం మొక్కజొన్న పంట సాగుచేశారు. వారి పొలంలోనే 11కేవీ విద్యుత్‌లైనుకు సంబంధించిన స్తంభాన్ని 35ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాని అడుగు భాగాన విరిగింది. అదే స్తంభానికి ఇద్దరు రైతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ సైతం అమర్చారు. అయితే ఆ విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో సమీప పొలాల్లోకి రైతులు వెళ్లాలంటే జంకుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమను ఎవరు రక్షిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాన్ని మార్చమని ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభాన్ని మార్చాలని వారు కోరుతున్నారు.

## పప్పుశనగ రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు



గుడిబండలో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రొద్దం, ఫిబ్రవరి 2 : రబీ సీజన్‌లో పప్పుశనగ సాగుచేసిన రైతులు ఈ - క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు తెలిపారు. ఆయన శుక్రవారం రొద్దం మండల పరిధిలోని ఆర్ కొట్టాల గ్రామంలో రబీ కింద సాగుచేసిన పప్పుశనగ పంటను పరిశీలించారు. ఈనెల 15లోగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అంజాద్, హంసవేణి, వీహెచ్ఏ కవిత, గోవిందప్ప, రైతులు జానకి, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని కొంకల్లు, గుడిబండ గ్రామాల్లో రబీ సీజన్‌లో రైతులు బోరుబావుల కింద సాగుచేసిన వేరుశనగ, వరి, మొక్కజొన్న తదితర పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. రైతుల తో పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 15లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏడీ కృష్ణమీనన్, వ్యవసాయాధికారి వీరనరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టండి

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



చిలమత్తూరులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిలమత్తూరు, ఫిబ్రవరి 2: మొక్కజొన్న, మిరప పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పుట్టపర్తి వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్తలు రామసుబ్బయ్య, రవికిషోర్ పేర్కొన్నారు. వారు శుక్రవారం మండలంలోని అప్పన్నపల్లి, దేమకేతేపల్లిల్లో పర్యటించి మొక్క జొన్న, మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. మొక్కజొన్న పంటకు సోకిన కత్తెర పురుగు నివారణకు కొరాజిన్ మందు 60 ఎం.ఎల్, లేదా బెంజోయేట్ 80 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న పంట 30 రోజుల నుంచి 50 రోజుల వ్యవధిలో ఉంటే ఎకరానికి 20 కిలోల పొటాష్, 50 కిలోల యూరియా వేయాలన్నారు. మిరప పంటను బూడిద తెగులు సోకిందని, దాని నివారణకు హెక్సాకొనజోల్ లేదా కార్బండిజం పిచికారి చేయాలని తెలిపారు. వరి పంటలో కాలిబాటలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ హిందూపురం ఏడీ అల్తాఫ్ అలీఖాన్, ఏఈఓ శ్రీవిద్య, వీఏఏలు జయశంకర్, మహేష్, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

లేపాక్షి : రైతులు సాగుచేసే పంటల్లో అధిక దిగుబడి కోసం వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటించాలని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త రవికిషోర్ సూచించారు. వారు శుక్రవారం గొంగటిపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసే రాగి, వేరుశనగ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎరువులను ఎంత మో తాదులో వాడాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హిందూపురం ఏడీ అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు బాధ్యతగా నడుచుకోవాలి: డీపీటీఓ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీటీఓ మధుసూదన్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2: ఆర్టీసీ డ్రైవర్‌లు బాధ్యతగా నడుచుకోవాలని డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ చేతుల్లో ఉంటాయన్నారు. సంస్థపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణి సురక్షితం అన్నారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని డ్రైవర్లు, కండెక్టర్లకు సూచించారు. జీవితం విలువైనదని, డ్రైవర్లు మత్తు పానీయాలకు అలవాటు పడరాదన్నారు. ప్రయాణికుల ప్రాణాలతో పాటు కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్, ఆర్టీసీ సీఐ హంపన్న, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 'అంబికాకు టీడీపీ ఎంపీ టికెట్ కేటాయించాలి'

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2: టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు హిందూపురం ఎంపీ టికెట్ కేటాయించాలని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. వారు శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌమ్యుడు, అందరిని కలుపుకొని పోయే నాయకుడు, కులమతాలకు అతీతంగా ఆదరించే స్వభావం కలవాడు అయిన అంబికాకు ఎంపీ టికెట్ కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును వారు కోరారు. అంబికా పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న వ్యక్తి అని, బలమైన సామాజిక వర్గానికి చెందినవారన్నారు. స్థానిక నాయకులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈసారి గతంలో కన్నా టీడీపీని భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు రషీద్, జహీర్, ఆసీఫ్, అకీబ్, హబీబ్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మంగాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 2 : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పెనుకొండ నగర పంచాయతీ మంగాపురంలో ఎన్ఎస్ఎస్ -2 ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలో అంగనవాడీ కేంద్రం, వీధి పరిసరాల్లో శుభ్రత పనులు చేపట్టారు. మంగాపురంలో రోడ్డు పక్కన బ్లీచింగ్ చల్లి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు వలంటీర్లు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ఎముకలగుట్లపల్లిలో ఎస్‌పీఎస్ ఎయిడెంట్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ, శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ; ప్రిన్సిపాల్ అడవాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం రెండోరోజు ప్రజలను చైతన్య పరిచారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బాబు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.